క్లుప్తంగా

ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలి

కాశిబుగ్గ: అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరీ – 2002 రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. నగర పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వస్తున్న నేపథ్యంలో వారు ఓ ప్రకటనలో పైవిధంగా పేర్కొన్నారు. ఆజంజాహి మిల్లు స్థలంలోనే తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ కార్మికులు గత కొనేళ్లుగా ఎదురుచూస్తూ పోరాడుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో మిల్లు స్థలంలోనే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని 2021, అక్టోబర్‌లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని పేర్కొన్నారు.

ఆలయాల్లో మాస శివరాత్రి పూజలు



కాశిబుగ్గ: మాస శివరాత్రిని పురస్కరించుకుని కాశిబుగ్గలోని పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వరాలయంలో తెల్లవారుజామున మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గణపతి సహిత రుద్రహోమం నిర్వహించారు. అలాగే అన్నపూజ నిర్వహించి భక్తుల ప్రసాద వితరణ చేశారు. కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో అన్నపూజ చేశారు. పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యస్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, కొమురయ్య, వైకుంఠం, అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం

న్యూశాయంపేట: దేశాన్ని బీజేపీ బందీఖానా నుంచి విముక్తి చేద్దామని హనుమకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి బి.చక్రపాణి పిలుపునిచ్చారు. రాంనగరంలోని పార్టీ కార్యాలయంలో బుక్‌లెట్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పదేళ్లపాలనలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవరెడ్డి, చుక్కయ్య, ఉప్పలయ్య, వెంకట్, సంపత్, భానునాయక్, తదితరులు పాల్గొన్నారు.

చల్లని మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేయాలి

వరంగల్: డిగ్రీ పరీక్ష కేంద్రాలు, ఆస్పత్రుల్లో చల్లని మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల దృష్ట్యా వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రంతోపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

10న ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 10వ తేదీన హనుమకొండ చౌరస్తా సమీపంలోని పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రఘుపతిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న ఉచిత వైద్య శిబిరంలో ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొని వైద్య పరీక్షలు చేసి తగు సలహాలు, సూచనలు చేయనున్నట్లు తెలిపారు. రూ.5 వేల విలువైన ఫైబ్రోస్కాన్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్య సేవల కోసం 99559 96166, 91338 93360 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు



కాజీపేట: అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి జ్ఞాపకార్థం స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో భక్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, చొక్కారపు శ్రీనివాస్, తేలు సారంగపాణి, పి.శివకుమార్, హరాస్వామి, వి.రఘు, మణిదీప్, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బీఫాం అందజేత



హన్మకొండ: వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి అయిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాంను స్వీకరించారు. మంగళవారం ఆయన నల్లగొండలో నామినేషన్ వేయనున్నారు.

నీరు లేదు.. నీడ లేదు

- ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకుంటున్న కూలీలు
- ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వసతులు కరువు
- ఎండల తీవ్రతతో ఇక్కట్లు ఎదుర్కొంటున్న కూలీలు
- పట్టించుకోని అధికారులు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

హసన్‌పర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్న ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం నీరు, నీడ కూడా కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పనులు జరిగే ప్రాంతాల్లో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా అవేవీ కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

సౌకర్యాలు కరువు

హసన్‌పర్తి మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా, సుమారు ఐదు వేల పైచిలుకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఎండాకాలంలో ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు కూలీలు ఆయా ప్రదేశాల్లో గుర్తించి చోట పనులు చేస్తున్నారు. పనులు చేసే ప్రదేశాల్లో కనీసం సౌకర్యాలు కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కొన్నిప్రాంతాల్లో అధికారులు అవేవీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. తమ ఇళ్ల నుంచే తాగునీరు తీసుకెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. నీళ్ల కోసం ఒక్కో కూలీకి రోజుకు 30 పైసల చొప్పున నిధులు విడుదలవుతున్నా అవి మాయమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పనులు జరుగుతున్న క్రమంలో అన్నాసాగరానికి చెందిన వెల్లిశోజు కోటి లింగం అనే కూలీ ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు. హసన్‌పర్తి మండలంలోని పలు ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. చీరెల నీడను కూలీలు విశ్రాంతి తీసుకుంటున్నారు.



విశ్రాంతి కోసం చీరలతో ఏర్పాటు చేసిన నీడ

సౌకర్యాలు సమకూర్చుతాం..

ఉపాధి హామీ ప్రదేశాల్లో కూలీలకు నీళ్లు, నీడ కల్పించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదే. నీళ్ల కోసం ఒక్కో కూలీకి రోజువారీగా 30పైసల చొప్పున నిధులు విడుదలవుతున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాం.

– విజయలక్ష్మి, ఏపీఓ

వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టం చేస్తాం..

- దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు దామోదర్



సీసీఐ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వినియోగదారుల సమితి ప్రతినిధులు

హన్మకొండ: దేశంలో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టవంతం చేస్తామని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ అన్నారు. హైదరాబాద్‌లో కన్స్యూమర్ కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 24వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల ప్రతినిధుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 ఏళ్లుగా దేశంలో వినియోగదారుల రక్షణ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వంతో కలిసి కన్స్యూమర్ కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. 2001, మే 6న న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన సీసీఐ.. దేశంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ గల సంస్థగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. ఈమేరకు సీసీఐ ఫౌండేషన్ డే పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, హైకోర్టు న్యాయవాది వలుపదాసు రాజు, సీసీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొంతం వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్య విజయానికి శాయశక్తులా కృషి చేయాలి



న్యూశాయంపేట: వరంగల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. మంత్రి, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను వరంగల్‌లో పలు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ చాంద్‌పాషా, అహ్మద్ ఉన్నారు.

కావ్యకు రైతు సంఘం మద్దతు

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపునిచ్చింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి వీరగోని శంకరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా 3 నల్ల చట్టాలను తెచ్చి వారిని గోసపెడుతోందని విమర్శించారు. డాక్టర్ స్వామినాథన్ నివేదికను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మడ్డి రాజారాం గౌడ్, అరుణ, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ మోసం చేశాయి



ఖిలా వరంగల్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు పద్మశాలి, అఫీషియల్స్, అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మద్దతు ఇస్తున్నట్లు పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పోపా కార్యాలయంలో సోమవారం జరిగిన పద్మశాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి కుల వృత్తి, చేనేతకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయని ఆరోపించారు. కొండా దంపతుల నాయకత్వంలో కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి పద్మశాలి ఐక్యత, సత్తా చాటాలని ఆయన కోరారు. సుధాకర్, ధర్మపురి రాజగోవిందు, సింగం కుమార్, పెద్దన్న, కిరణ్, రాజు, అశోక్‌కుమార్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి పోలీసులు



విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న టీఎస్ఎస్పీ అధికారులు

మామునూరు: నేటి విద్యార్థులే రేపటి పోలీసులని, విద్యార్థులు చట్టాలు, ఆయుధాలపై అవగాహన పెంచుకోవాలని టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌ను శ్రీరామకృష్ణ సేవా సమితి, వరంగల్ ఆధ్వర్యంలో బాలసంస్కార్ –2024 విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుధాల పనితీరుపై టీఎస్ఎస్పీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో యోగా, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం, సాంస్కృతిక నృత్యాలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జి.కార్తీక్, ఎం.రామ్‌ప్రసాద్, కృష్ణ, ఎంఆర్ఎస్ఐ శ్రీనివాస్, విజయ్, అభిలాష్, కిషోర్, నాగాచారి, రామకృష్ణ సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

హన్మకొండ అర్బన్: వైద్యశాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి అరిక్ స్వామి, ఆప్తాల్మిక్ అధికారి ప్రకాశం పదవీ విరమణ పొందగా వారిని కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాన్ని టీఎన్జీవోస్ సభ్యులకు అందజేసి, సర్వీస్ మ్యాటర్‌లో సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు రామినేని శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, కత్తి రమేష్, రాము నాయక్, మోయిస్, లక్ష్మీప్రసాద్, నాయకులు సలీం, రాజమౌళి, బింగి సురేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సెలవులు వద్దు.. హాస్టళ్లు తెరిచే ఉంచాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి సెలవులు ఇవ్వొద్దని.. హాస్టళ్లు తెరిచే ఉండాలని ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థులు పోటీ పరీక్షల కోసం కోసం లైబ్రరీలో చదువుకుంటున్నారని అన్నారు. పీజీ విద్యార్థులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తికాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ ఉపాధ్యక్షుడు జశ్వంత్, బీఎస్ఎఫ్ అధ్యక్షుడు శివ, రాజారెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ కుమార్తె సబ్బని స్పందన (24) ఇంటి వద్దనే ఉంటూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తోంది. ఈనెల 4న ఉదయాన్నే వ్యక్తిగత పని ఉందంటూ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మున్నీరుల్లా తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



హన్మకొండ: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లు

హన్మకొండ: ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలో ట్రావెల్ ఏజెన్సీ యజమానులు, డ్రైవర్లతో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వాహనాల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఓటు వేసేలా వారికి యజమానులు, డ్రైవర్లు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు ఎంతో విలువైనదని, దాన్ని వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో జంపాల జనార్దన్, గుగులోతు రామోజీ, కిషన్, దేవేందర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై చైతన్యం కలిగి ఉండాలి

ఖిలా వరంగల్: ప్రతిఒక్కరూ ఓటు హక్కుపై చైతన్యం కలిగి ఉండాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఖిలా వరంగ్ వాకింగ్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు ఓటు వినియోగంపై సోమవారం అవగాహన కల్పించారు. అర్హులందరూ ఓటేయ్యాలని కోరారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంజీవరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జగదీశ్వర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గడపగడపకు వెళ్లి ఓట్లు అడగాలి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



వరంగల్: పార్టీలో చేరిన నాయకులు

హసన్‌పర్తి: గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లు అడగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. మాజీ వార్డు సభ్యుడు గడ్డం శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో 55వ డివిజన్ భీమారానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ భీమారం శాఖ అధ్యక్షుడు మార్క రాజు, కాంగ్రెస్ నాయకులు గోపరబోయిన కొమురయ్య, ఆకుల కుమార్, సంగాల ప్రసాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వరంగల్: తమ పార్టీ విధానాలు నచ్చి బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. సోమవారం 14డివిజన్ ఎన్టీఆర్‌నగర్ గ్రామం నుంచి కార్పొరేటర్ తూర్పాటి సులోచన, నాయకులు సారయ్య, అడుప మహేష్, సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో చేరిన నాయకులకు కండువాలు పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఈర్ల రాజేందర్, పిట్ట నగేష్, భిక్షపతి, అంజయ్య, యూత్ నాయకులు భరత్, సుధీర్, మహిళలు శైజాజీ, ఎలేంద్ర, శోభ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీని చిత్తుగా ఓడించాలి



19వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



హసన్‌పర్తి: కరపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ / కాశిబుగ్గ: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకుడు కేతిరి రాజశేఖర్ కోరారు. 14, 19వ డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను, మతం పేరుతో ఓటు రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో క్యాతం రంజిత్, బానోత్ కిరణ్‌నాయక్, చెన్నూరి కిషోర్, నోముల హహేందర్, కేతిరి సమ్మక్క, సరోజన, విమల, రాజు, మల్లయ్య, అభిషేక్, చిరంజీవి, హరీష్, పాపయ్య, బాలు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం

హసన్‌పర్తి: బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ నగరంలోని ఒకటవ డివిజన్ ముచ్చర్లలో నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, ప్రమోద్, సుమన్, రాకేష్, శ్రవణ్, సతీష్, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: ఈనెల 8న మామునూరు లక్ష్మీపురంలో ప్రధాని మోదీ పాల్గొనే 'ఓరుగల్లు జన సభ'ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. ఓసిటీలోని స్వగృహంలో సభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా ప్రయాస్ అనే నినాదంతో దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, పోలెపాక మార్టిన్ లూథర్, ఎరుకుల రఘునారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, టీకుమట్ల రేణుక కందిమల్ల మహేష్, బైరి శ్యామ్, వెంకట్ పాల్గొన్నారు.

ఓరుగల్లుపై బీజేపీ జెండా ఎగరడం పక్కా



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్, నాయకులు

హన్మకొండ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓరుగల్లు గడ్డపై బీజేపీ జెండా ఎగరడం పక్కా అని కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 60వ డివిజన్ వడ్డెపల్లిలోని ముదిరాజ్‌వాడలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీకే ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, రాజిరెడ్డి నాయకులు రామరాజు, యాదగిరి, ప్రవీణ్, సాగర్, నరేష్, బాబీ, చందు, సన్నీ, అరవింద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనాదేవి, వనిత, మౌనిక, విరీష, శ్రుతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

నయీంనగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, పూల రవీందర్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించామని, ఎన్నికల కోడ్ ముగియగానే సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. నాయకులు బాల్నె రామయ్య, ఎం.మధు, జి.సత్యనారాయణ, అంజిరెడ్డి, మొగిలయ్య, రాజిరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

హన్మకొండ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి మేరుగు బాబు యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని గొప్ప మనస్సుతో అవగాహన, అర్థం చేసుకుని ఎంతో సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అందుకు కృతజ్ఞతగా తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకురాలి ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడంతో కాంగ్రెస్ నాయకురాలు యాకూబ్ బీ మనస్తాపానికి గురయ్యారు. ఈమేరకు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి వరంగల్ 37వ డివిజన్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్ నగర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యాకూబ్ బీ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.